

అభివాదం చేస్తున్న జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి నాయకులు

పార్లమెంటు ఎన్నికల్లో యాదవులకు రెండు స్థానాలు కేటాయించాలి

పంజాగుట్ట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో యాదవ సామాజిక వర్గానికి అన్ని పార్టీలు రెండు స్థానాలు కేటాయించాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు శెట్టి వంశీ మోహన్ యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి గుడిగే శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం అన్ని పార్టీలు రెండు ఎంపీ స్థానాలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎం.అనిల్ కుమార్‌యాదవ్‌ను రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేయడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి తమ సామాజికవర్గానికి చెందిన నాగ సీతారాములుకు టికెట్ ఇస్తే అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని అన్నారు. సమావేశంలో సమితి నాయకులు జి.రవి యాదవ్, జి.పవన్ యాదవ్, బి.శ్రీనివాస్‌యాదవ్, సాయికుమార్‌యాదవ్, వీరేందర్‌యాదవ్, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బచ్‌పన్ స్కూల్ వార్షిక స్పోర్ట్స్ డే



విద్యార్థులకు ట్రోఫీని అందజేస్తున్న బచపన్ స్కూల్స్ రీజినల్ డైరెక్టర్ కౌశిక్ రెడ్డి

అమీర్‌పేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌నగర్, కూకట్‌పల్లికి చెందిన బచ్‌పన్ స్కూల్ వార్షిక స్పోర్ట్స్ డే 2024 ఫీల్స్ ఆఫ్ ఫీస్టా వేడుకలు సోమవారం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, కోకో, కబడ్డీ, వ్యాసరచన, రన్నింగ్ తదితర పోటీలను నిర్వహించారు. ఆటలు ముగిశాక సాంస్కృతిక వేడుకలను విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో నిర్వహించారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు ట్రోఫీలను పాఠశాల రీజినల్ డైరెక్టర్ కౌశిక్ రెడ్డి, డైరెక్టర్ మురళీధర్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఇందులత రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాళ్లు నీరజ కక్కర్, అల్లూరి లక్ష్మి, అతిక్ సిద్దిఖీ, ఖలీల్ ఉర్ రహమాన్, అనికేత్ చౌహాన్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విజయారెడ్డి

మసీదుల్లో సదుపాయాలు కల్పించండి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం ప్రారంభమయ్యే లోపు ఖైరతాబాద్ నియోజకవర్గంలోని అన్ని మసీదుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నాయకురాలు, కార్పొరేటర్ విజయారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్‌అలీని విజయారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మసీదుల్లో పెయింటింగ్, లైటింగ్, మంచినీరు, సివరేజీ, శానిటేషన్ పనులు, ఇతర అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

అఫిలియేషన్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

● ఉత్తర్వులు జారీచేసిన జేఎన్‌టీయూ రిజిస్ట్రార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అఫిలియేషన్ కోసం దరఖాస్తు గడువును పొడిగిస్తూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు వంద శాతం జరిమానా విధిస్తామని ఆదేశించడంపై.. జేఎన్‌టీయూలో అఫిలియేషన్ దందా..! శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జేఎన్‌టీయూ అధికారులు స్పందించారు. ఎటువంటి జరిమానా చెల్లించాల్సిన అవసరం లేకుండా సోమ, మంగళవారాల్లోనూ దరఖాస్తులు సమర్పించవచ్చని రిజిస్ట్రార్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రేపటి నుంచి ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలతో సమావేశాలు

వర్సిటీ అధికారులు ఏకపక్షంగా తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రైవేటు కళాశాలల నుంచి తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం కావడంతో.. యాజమాన్యాలను బుజ్జగించేందుకు బుధవారం నుంచి మూడు రోజులపాటు జేఎన్‌టీయూలో సమావేశాలు నిర్వహించనున్నారు. 21న అటానమస్, 22న నాన్-అటానమస్, 23న ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కళాశాలల యాజమాన్యాలతో వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్, అకడమిక్ ఆడిట్ సెల్ అధికారులు సంప్రదింపులు జరపనున్నారు. యాజమాన్యాలతో మీటింగ్స్ షెడ్యూలును అన్ని అఫిలియేటెడ్ కళాశాలలకు రిజిస్ట్రార్ సర్క్యులేట్ చేశారు.


నాకు చలానా రాస్తావా.. నీ అంతు చూస్తా

● ట్రాఫిక్ ఎస్సైని బెదిరించిన యువకుడు ● కేసు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్సైని దుర్భాషలాడి బెదిరించిన యువకుడిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో సిబ్బంది యూసుఫ్‌గూడ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఇందిరానగర్‌కు చెందిన రమావత్ అంజనేయులు (30) తన బైక్‌పై హెల్మెట్ లేకుండా వెళ్తుండడంతో ట్రాఫిక్ పోలీసులు ఆపారు. చలానా వేయటంతోపాటు నాలుగు పెండింగ్ చలానాలు ఉన్నాయని, చెల్లించాలని ఎస్సై నరేష్ సూచించారు. దీంతో అంజనేయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎస్సైతో వాగ్వాదానికి దిగాడు. 'నాకు చలానా వేస్తే నీ అంతు చూస్తా.. మీడియాను పిలిచి నీ ఉద్యోగం ఊడగొడతా.. నా గురించి పంజాగుట్ట పీఎస్‌లో తెలుసుకోండి' అంటూ దుర్భాషలాడాడు. అంతటితో ఆగకుండా చలానా వేస్తే నా బైక్‌పై పెట్రోల్‌పోసి కాల్చేస్తానని బెదిరించాడు. ట్రాఫిక్ ఎస్సై ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బేగంపేట ఫ్లైఓవర్‌పై డివైడర్‌ను ఢీకొట్టిన కారు

● ఒకరికి గాయాలు



ఫ్లైఓవర్‌పై డివైడర్‌ను ఢీకొట్టిన కారు

బేగంపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న కారు ఫ్లైఓవర్‌పైన మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతినడంతో పాటు అందులో ప్రయాణిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బేగంపేట ఫ్లైఓవర్‌పై సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నుంచి పంజాగుట్టవైపు వెళ్తున్న కారు తెల్లవారుజామున 5:30 గంటల సమయంలో బేగంపేట ఫ్లైఓవర్‌మీదుగా వెళ్తుండగా... మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న ఐటీ ఉద్యోగి గౌతమ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో గాయపడిన వ్యక్తిని బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గురైన కారును క్రేన్‌తో పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

గ్రేటర్ బడ్జెట్ రూ.7,937 కోట్లు

● ప్రస్తుతంతో పోలిస్తే రూ.1,713 కోట్లు అధికం

● నేడు కౌన్సిల్‌లో చర్చ ● ఆమోదం అనంతరం ప్రభుత్వానికి



సమావేశంలో ఎమ్మెల్యేలు గాంధీ, రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాణీదేవి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ బడ్జెట్ భారీగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రతిపాదించిన బడ్జెట్‌తో పోలిస్తే 2024-25 పద్దును రూ.1,713 కోట్లు పెంచుతూ.. రూ.7,937 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించారు. 2023-24 సవరణ బడ్జెట్ మాత్రం రూ.6,990 కోట్లుగా చూపారు. మొదటిసారి జీహెచ్‌ఎంసీ చేసిన అప్పులకు సంబంధించిన వాయిదాలు, వడ్డీలకోసం రూ.1200 కోట్లు ప్రభుత్వం నుంచి వస్తుందని ఆశిస్తున్నారు. బడ్జెట్ పెరుగుదలకు ఇది ప్రధాన కారణం కాగా.. మ్యుటేషన్ రుసుము ప్రస్తుతం రూ.10 కోట్లు ఉండగా దానిని రూ.200 కోట్లకు పెంచారు. ప్రభుత్వం నుంచి ఇతర రూపాల్లో వచ్చే ఆదాయమూ రూ.300 కోట్లకుపైగా పెరుగుతుందని ప్రతిపాదనల్లో చూపించారు. ఆస్తిపన్ను, పట్టణ ప్రణాళికా విభాగాల ఆదాయం రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్లు పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌ఆర్‌డీపీ), వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌ఎన్‌డీపీ), కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్ (సీఆర్‌ఎంపీ)ల కోసం రూ.6,500 కోట్లకుపైగా అప్పు చేసిన నేపథ్యంలో ఆ రుణానికి ప్రతినెలా వడ్డీ, అసలు కలిపి నెలకు రూ.100 కోట్లు చెల్లించాల్సి ఉంది. వాస్తవంగా ఆయా పనులు ప్రభుత్వం చేయాల్సి ఉండడం.. గత సర్కారు ఆదేశాల మేరకు అప్పు తీసుకొని చేసిన దృష్ట్యా.. ఆ మొత్తం ప్రభుత్వం ఇవ్వాలనే బడ్జెట్‌లో ప్రతిపాదించినట్టు ఓ అధికారి చెప్పారు. నేడు జరుగనున్న సమావేశంలో మొదటి సెషన్‌లో ప్రశ్నోత్తరాలపై, రెండో సెషన్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌పై చర్చించనున్నారు. ఆమోదం అనంతరం పద్దును ప్రభుత్వానికి పంపనున్నారు.

బడ్జెట్ సంక్షిప్త స్వరూపం..

రెవెన్యూ ఆదాయం(రూ.కోట్లలో)..

- ఆస్తిపన్ను - రూ.1907 కోట్లు
- టౌన్‌ప్లానింగ్ - 1600
- ప్రభుత్వం నుంచి - 785
- మ్యుటేషన్ రుసుము - 200
- ట్రేడ్ లైసెన్స్ - 110 ● ప్రకటనలు - 20
- ఎస్టేట్ - 10
- రుణా చెల్లింపునకు ప్రభుత్వం నుంచి నిధులు - 1200
- ఇతరత్రా- 106

మొత్తం- 5938

మూలధన ఆదాయం (రూ.కోట్లలో)...

- 15వ ఫైనాన్స్ కమిషన్ - 350
- టీడీఆర్ - 300 ● ఇతర గ్రాంట్లు - 11
- డిపాజిట్ వర్క్ రశీదులు - 8
- ఇతరత్రా రశీదులు - 2
- రుణం- 128
- ప్రభుత్వం నుంచి గ్రాంట్లు - 1200

మొత్తం- 1999

సమాజానికి మార్గనిర్దేశం చేసే రచనలు రావాలి

● మంత్రి పొన్నం ప్రభాకర్ ● ముగిసిన హైదరాబాద్ పుస్తక ప్రదర్శన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు మార్గనిర్దేశం చేసేలా మేధావులు, విద్యావంతులు రచనలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. భిన్న భావజాలాలు, విభిన్న దృక్పథాలకు సంబంధించిన పుస్తకాలన్నీ ఒకచోట ఉండటం, పుస్తక మహోత్సవ ప్రాంగణాన్ని చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. సోమవారం ఎన్టీఆర్ స్టేడియంలో 36వ హైదరాబాద్ జాతీయ పుస్తక మహోత్సవ ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. బుక్ ఫెయిర్ నిర్వహణకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా తాను ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. ఎన్టీఆర్‌స్టేడియంలో శాశ్వత మరుగుదొడ్లు నిర్మిస్తామని వాగ్దానం చేశారు. పిల్లలకు పుస్తక పఠనాభిరుచిని పరిచయం చేసే విధంగా తల్లిదండ్రులు ప్రయత్నించాలని సూచించారు. ఆలోచనలను విస్తృతం చేసుకోవాలన్నా, సమాజాన్ని అర్థం చేసుకోవాలన్నా పుస్తకమే ఆధారమని అన్నారు. యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా, వ్యక్తిత్వాన్ని మలచుకోవడానికి పుస్తకాలను ఆశ్రయించాలని హితవుపలికారు. సామాజిక మార్పునకు దోహదపడంతోపాటు సామాజిక చైతన్యాన్ని పెంపొందించే దిశగా రచనలు చేయడం కవులు, రచయితల బాధ్యత అని అన్నారు. వర్తమానాన్ని విశ్లేషిస్తూ, భవిష్యత్తుకు బాట చూపే ఆశావాహ రచనలు రావాలని ఆకాంక్షించారు. ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ రమా మేల్కొటే మాట్లాడుతూ.. భారతదేశ చరిత్ర, తెలంగాణ చరిత్రలను వక్రీకరిస్తున్న ప్రస్తుత సందర్భంలో వాస్తవాలు పునాదిగా లిఖించబడిన చరిత్ర పుస్తకాలు చదివి అబద్ధాల చరిత్రను తిప్పికొట్టాలని పాఠకులకు సూచించారు. ట్రాన్స్ మహిళ రచన ముద్రబోయిన మాట్లాడుతూ.. సమాజంలో ట్రాన్స్ వ్యక్తుల పట్ల ఉన్న వివక్షకు వ్యతిరేకంగా తమ జీవితాలు ఇతివృత్తంగా మరిన్ని రచనలు రావాలని, అందుకు రచయితలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. ప్రముఖ కవి కె. శివారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచాన్ని చూపించింది, పరిచయం చేసిందీ పుస్తకమే అని అన్నారు. ఓయూ వీసీ రవీందర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, కవి యాకూబ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బుక్ ఫెయిర్ అధ్యక్షుడిది పురుషాహంకార ధోరణి

● స్త్రీవాద రచయిత్రుల ఆగ్రహం ● ట్రాన్స్ మహిళను పిలిచి అవమానించారని విమర్శలు ● అధ్యక్షుడి తీరు సరికాదన్న సామాజిక ఉద్యమకారులు



మాట్లాడుతున్న రచన ముద్రబోయిన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బుక్ ఫెయిర్ అధ్యక్షుడి పురుషాహంకార ధోరణికి నిదర్శనం స్త్రీ వాద రచయిత్రుల సభను జరగనీయకపోవడం అంటూ రచయిత్రులు, సామాజిక ఉద్యమకారులు నిరసించారు. అధ్యక్షుడి తీరును వ్యతిరేకిస్తూ సోమవారం స్టాల్ నెంబరు 205 వద్ద రచయిత్రి సజయ నేతృత్వంలో స్త్రీవాద రచయిత్రులు, సామాజిక ఉద్యమకారులు పలువురు సమావేశం నిర్వహించారు. భిన్న నేపథ్యాలకు చెందిన రచయిత్రులతో 'స్త్రీ వాద రచయిత్రులు - వర్తమాన సవాళ్ళు' అంశంపై ఆదివారం తాము నిర్వహించ తలబెట్టిన చర్చాగోష్టిని సమయం లేదంటూ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు అడ్డుకున్నారని పలువురు రచయిత్రులు, సామాజిక కార్యకర్తలు విమర్శించారు. ఇది మహిళల పట్ల వారికున్న వివక్షకు నిదర్శనమని అన్నారు. బుక్ ఫెయిర్ నిర్వహణ కమిటీలో మహిళల భాగస్వామ్యం లేకపోవడాన్ని ప్రశ్నించారు. ట్రాన్స్ మహిళ రచన ముద్రబోయిన, ఓ వైపు చెత్త సేకరిస్తూ, డిగ్రీ చదువుతున్న వర్ధమాన రచయిత్రి జయలక్ష్మి, ఒంటరి స్త్రీలపై కథా సంపుటి వెలువరించిన విజయ భండారు, సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ రచనలు చేస్తోన్న పూర్ణిమ తమ్మిరెడ్డి, విప్లవోద్యమంలోని మహిళల కథలను సంకలనం చేసిన అనూరాధ, అపర్ణ తోట, మెర్సీ మార్గరెట్, సాత్విక నన్నెబోయిన, దాసోజు లలిత తదితరులు చర్చాగోష్టిలో మాట్లాడాలి అనుకున్న అంశాలను ప్రస్తావించారు. స్త్రీల రచనలకు సంబంధించిన సమావేశాన్ని చివరి నిమిషంలో రద్దు చేయడం అన్యాయమని ఆక్షేపించారు. వీరికి సంఘీభావంగా విజయ్ వంగలపూడి, ఆర్.భరద్వాజ తదితరులు మాట్లాడారు.

వేదికపై వాగ్వాదం

'స్త్రీవాద రచయిత్రులు వర్తమాన సవాళ్లు' సదస్సును చివరి నిమిషంలో రద్దు చేసి విమర్శల పాలైన బుక్ ఫెయిర్ నిర్వాహకులు, ఆ పొరపాటును సరిదిద్దుకొనేందుకు ట్రాన్స్ మహిళా రచయిత్రి, ఉద్యమకారిణి రచన ముద్రబోయినను ముగింపు సమావేశానికి ఆహ్వానించారు. రచనతో మాట్లాడించాలని కార్యనిర్వాహక సభ్యుడు బాల్‌రెడ్డి సూచించగా.. ఎవర్ని అడిగి ఆమెను పిలిచారంటూ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ మండిపడ్డారు. ఈ విషయంలో వేదికపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో వాగ్వివాదం జరిగింది. మంత్రి జోక్యం చేసుకొని రచన ముద్రబోయినతో మాట్లాడించాలని సభాధ్యక్షుడిని ఆదేశించగా.. గొడవ సద్దుమణిగింది. స్త్రీవాద రచయిత్రుల సదస్సు చివరి నిమిషంలో రద్దవడంపట్ల బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు. ఇలాంటివి మరోసారి జరగనీయబోమన్నారు.

రాబోయే రోజుల్లో ఉచితంగా కంటి చికిత్సలు



కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తదితరులు

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కంటి జబ్బులతో బాధపడేవారికి రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కంటి చికిత్సలు చేయిస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో మన అమెరికన్ తెలుగు అసోషియేషన్, శంకర్ నేత్రాలయ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి చికిత్సల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. ఇక్కడ 200ల మందికి కంటి శస్త్ర చికిత్సలు చేస్తున్నారని, ఇందులో క్రిటికల్ సమస్యలు ఉన్నవారిని చెన్నైలోని శంకర్ నేత్రాలయానికి తీసుకెళ్లి అక్కడ వైద్యం చేయించటం ఎంతో బాధ్యతతో కూడుకున్న విషయమన్నారు. చెన్నై వెళ్లే రోగులకు రవాణా, వసతి సౌకర్యాలు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన ఫౌండర్ శ్రీనివాస్, అడ్వయిజర్ ప్రదీప్, శంకర్ నేత్రాలయ ప్రతినిధి అరుల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు చిన్న శ్రీశైలంయాదవ్, నవీన్‌యాదవ్, నిర్వాహకురాలు, ప్రముఖ యాంకర్ సుమ కనకాల పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యావ్యవస్థపై నిర్లక్ష్యం

● టీడీఎఫ్ యూఎస్‌ఏ మాజీ చైర్మన్ డాక్టర్ గోపాల్‌రెడ్డి



ముసాయిదాను విడుదల చేస్తున్న టీడీఎఫ్ ప్రతినిధులు

పంజాగుట్ట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో విద్యావ్యవస్థ నిర్లక్ష్యానికి గురవుతోందని తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం(టీడీఎఫ్) యూఎస్‌ఏ మాజీ చైర్మన్ డాక్టర్ జి.గోపాల్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఫోరం ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ విద్యారంగ సమస్యలు-పరిష్కారాలపై రూపొందించిన ముసాయిదాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి విద్యను మనం అందిస్తున్నామనే దానిని బట్టి అవకాశాలు పెరుగుతాయి కానీ, ఆంగ్ల మధ్యమంలో చదివితే అవకాశాలు వస్తాయనేది భ్రమ అని అన్నారు. నర్సరీ నుంచి రెండో తరగతి వరకు ప్రీ ప్రైమరీ పాఠశాలగా ఉండాలని, వాటిని అంగన్వాడీ కేంద్రాలతో అనుసంధానం చేయాలన్నారు. విద్యా రంగానికి బడ్జెట్లో ఎక్కువగా నిధులు కేటాయించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యా హక్కు చట్టం కల్పించిన సదుపాయాలను ప్రతి విద్యార్థికి అందించాలని, ఐదో తరగతి వరకు మాతృభాషలో బోధన జరగాలన్నారు. ఈ విషయాలపై సీఎం రేవంత్ రెడ్డిని కలిసి చర్చించామని, విద్యాశాఖ మంత్రిని కలుస్తామన్నారు. ఈ నెల 21,22 తేదీల్లో మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో సీఐఐ ఆధ్వర్యంలో విద్యపై జరిగే సదస్సులో తాము రూపొందించిన నివేదికపై ప్రజంటేషన్ ఇస్తామన్నారు. సమావేశంలో టీడీఎఫ్ ఇండియా అధ్యక్షుడు ఎం.రాజేశ్వర్‌రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

శివాజీకి ఘన నివాళి



ఖైరతాబాద్ మార్కెట్ చౌరస్తాలోని శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

బంజారాహిల్స్/బేగంపేట/ఖైరతాబాద్/బోరబండ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా డివిజన్లలోని ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు ఛత్రపతి శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు.



బోరబండ ఎస్‌ఆర్‌టీ నగర్‌లో శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పవనం శివశంకర్, స్థానికులు



జూబ్లీహిల్స్‌లో శివాజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ ఖైరతాబాద్ కన్వీనర్ గడ్డం వెంకట్‌స్వామి తదితరులు



శివాజీ జయంతి సందర్భంగా బేగంపేట డివిజన్‌లోని మాతాజీనగర్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న యువమోర్చా నేత పురురవారెడ్డి తదితరులు

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన



వీధులలో త్యాగరాజ స్వామి కీర్తనలు ఆలపిస్తూ నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన పెంచడం కోసం సంస్కార్ ది లైవ్ స్కూల్ త్యాగరాజ ఆరాధన ఉత్సవ నగర సంకీర్తన కార్యక్రమాన్ని చేపట్టింది. సోమవారం స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులలో ఎర్రగడ్డ, మోతి నగర్ వీధులలో త్యాగరాజ స్వామి కీర్తనలు ఆలపిస్తూ నృత్యాలు చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ఫౌండర్ సీఈవో ఏ మోహన వంశీ మాట్లాడుతూ ఈ ఆధునిక కాలంలో మన సంస్కృతి మరుగునపడి పాశ్చాత్య సాంప్రదాయాలను అవలంబిస్తూ మన సంస్కృతికి మనం దూరం అవుతున్నామని అన్నారు. ప్రజలకు మన సంస్కృతిపై అవగాహన పెంచడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా కలలపై ఆసక్తిని పెంపొందించడానికి మన సంగీత మేధావులు, కళాకారుల గురించి తెలియజేయడానికి విద్యార్థులు వీధులలో త్యాగరాజ స్వామి కీర్తనలు ఆలపిస్తూ నృత్యాలు చేస్తూ అలరించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మధుమతి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రజలు అభివృద్ధి చెందాలని నారీ వందనం కార్యక్రమం రాష్ట్ర కోఆర్డినేటర్ శిల్పారెడ్డి సూచించారు. బీజేపీ సీనియర్ నాయకురాలు దేరంగుల ప్రసన్న ఆధ్వర్యంలో సోమవారం ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీలలో ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభాత్ నగర్, సునీల్ నగర్ తదితర బస్తీలలో ఇంటింటికీ వెళ్లి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దర్శనం నాగేశ్వరరావు, షర్మిల జాదవ్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ బ్రెయిన్‌డెడ్

● అవయవాలను సేకరించిన జీవన్‌దాన్ సంస్థ సభ్యులు



శ్యాంసుందర్

మన్సూరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌డెడ్ అయిన ఓ కానిస్టేబుల్ తాను చనిపోతూ నలుగురికి ప్రాణం పోశారు. ఇబ్రహీంపట్నం మండలం, పొల్కంపల్లి సమీపంలోని నాగంపల్లి గ్రామానికి చెందిన మేకల శ్యాసుందర్(41) ఎల్బీనగర్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. జనవరి 27న ఇంట్లో కిందపడడంతో స్పృహ కోల్పోయాడు. కుటుంబ సభ్యులు అతడిని ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడలేదు. శ్యాంసుందర్ బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ఆదివారం ప్రకటించారు. జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయవదానంపై అవగాహన కల్పించారు. వారు అంగీకరించడంతో అతడి శరీరం నుంచి లివర్, కంటి శుక్లాలు సేకరించారు.

బ్లడ్ బ్యాంకు ముసుగులో ప్లాస్మా సేకరణ

● రెండు సెంటర్ల లైసెన్స్‌లు రద్దు

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మానవ ప్లాస్మాతో అక్రమ దందా చేస్తున్న రెండు బ్లడ్ బ్యాంకుల లైసెన్స్‌లను ఔషధ నియంత్రణ సంస్థ(డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్) రద్దు చేసింది. బ్లడ్ బ్యాంకు ముసుగులో ప్లాస్మా సేకరిస్తున్నట్లు అధికారులకు ఈనెల 2న సమాచారం అందడంతో మూసాపేటలో హైమా సర్వీస్ లేబొరేటరీస్‌లో దాడులు నిర్వహించారు. ఫ్రీజర్లలో హ్యూమన్ ప్లాస్మా బ్యాగ్‌లను గుర్తించారు. ఆర్.రాఘవేంద్రనాయక్ అనే వ్యక్తి అపార్ట్‌మెంట్‌లో ల్యాబ్ నిర్వహిస్తూ.. పలు బ్లడ్ బ్యాంకుల నుంచి అక్రమంగా ప్లాస్మా సేకరించి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ప్లాస్మా సేకరణ నిమిత్తం శ్రీకర హాస్పిటల్ బ్లడ్ సెంటర్, న్యూ లైఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ బ్లడ్ సెంటర్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా సహకరించినట్లు తెలిసింది. అధికారులు మదీనాగూడలో ఉన్న వెంకటేశ్వర ఆర్థో హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుబంధంగా ఉన్న శ్రీకర హాస్పిటల్ బ్లడ్ సెంటర్, దారుల్‌షిఫాలో గల న్యూ లైఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ బ్లడ్ సెంటర్‌పై దాడులు నిర్వహించారు. సిబ్బందిని విచారించగా.. రక్త సేకరణ తర్వాత ప్లాస్మా తీసి తరలిస్తున్నట్లు అంగీకరించారు. ఆ సెంటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసి లైసెన్స్‌లు రద్దు చేసినట్లు డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు.

రాజీవ్ నగర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా రాజీవ్ నగర్‌లో కాలనీలోని పార్కులను కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు సోమవారం శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వినయసాగర్, గౌరవ అధ్యక్షుడు కృష్ణ శర్మ, ఉపాధ్యక్షుడు భుజంగరావు, పార్కుల కన్వీనర్ బదురుద్దీన్, సభ్యులు వీఎస్ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 86 ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రోడ్ నెంబర్ 86, చిట్టం రామచంద్రారెడ్డి, సినీ నిర్మాత బెల్లంకొండ సురేష్ ఇళ్ళు, మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి ఇంటి ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

'శివాజీ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి'

పంజాగుట్ట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి రోజును (ఫిబ్రవరి 19) ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ స్వచ్ఛంద సంస్థ జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి.రవిశేఖర్ రెడ్డి అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా సోమవారం మధురానగర్ జీ-బ్లాక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఏపీ మల్లేష్ గౌడ్, సన్నీగౌడ్, సంతోష్ గౌడ్, ఉదయ్ కుమార్, అమర్దీప్, ఆటో యూనియన్ నాయకులు రమేష్, మధు, యూసఫ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బంది పెడితే కఠినచర్యలు

● ఇన్‌స్పెక్టర్ హెచ్చరిక ● 'మందుబాబులకు పార్కింగ్ అడ్డాగా ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం' కథనానికి స్పందన



హాస్టల్ పరిసర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బోయినపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి, బాపూజీనగర్ గిరిజన హాస్టల్, ప్రభుత్వ పాఠశాల ప్రాంతంలో వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేసి మద్యం తాగి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న వారు పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి హెచ్చరించారు. 'మందుబాబులకు పార్కింగ్ అడ్డాగా ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం' పేరుతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి సోమవారం పాఠశాల, హాస్టల్స్‌ను పరిశీలించారు. పార్కింగ్ చేసిన వాహనాలకు జరిమానా విధించారు. పలువురు స్థానికులకు కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గస్తీ పెంచుతామని, వాహనాలు పార్కింగ్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ప్రిన్సిపాళ్లు ఆశీర్వాదం, లాలూనాయక్, హాస్టల్ వార్డెన్ నీలిమ ఉన్నారు.

కానిస్టేబుల్ బ్రెయిన్‌డెడ్

● అవయవాలు సేకరించిన జీవన్‌దాన్ సంస్థ సభ్యులు



శ్యాంసుందర్(ఫైల్)

మన్సూరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌డెడ్ అయిన ఓ కానిస్టేబుల్ తాను చనిపోతూ నలుగురికి ప్రాణం పోశారు. ఇబ్రహీంపట్నం మండలం, పొల్కంపల్లి సమీపంలోని నాగంపల్లి గ్రామానికి చెందిన మేకల శ్యాంసుందర్(41) ఎల్బీనగర్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. జనవరి 27న ఇంట్లో కింద పడడంతో స్పృహ కోల్పోయాడు. కుటుంబ సభ్యులు అతడిని ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడలేదు. శ్యాంసుందర్ బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ఆదివారం ప్రకటించారు. జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయవదానంపై అవగాహన కల్పించారు. వారు అంగీకరించడంతో అతడి శరీరం నుంచి లివర్, కంటి శుక్లాలు సేకరించారు.

'రాచకొండ'లో ఇన్‌స్పెక్టర్‌లు, ఎస్‌ఐల బదిలీ

● హైదరాబాద్ కమిషనరేట్‌లో 38 మంది కానిస్టేబుళ్లు..

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 8 మంది ఇన్‌స్పెక్టర్‌లు, నలుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు వెంటనే బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు. హయత్‌నగర్ ఎస్‌హెచ్‌ఓగా జి.రామకృష్ణ, హయత్‌నగర్ డీఐగా జి.రుద్వీర్‌కుమార్, ఇబ్రహీంపట్నం ఎస్‌హెచ్‌ఓగా వి.సైదిరెడ్డి, బాలాపూర్ ఎస్‌హెచ్‌ఓగా టి.భూపతి, డి.యాలాద్రి స్పెషల్ బ్రాంచికి, ఎన్.అశోక్, ఉప్పల్ ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్‌గా ఇ.వెంకటరెడ్డి, ఉప్పల్ ట్రాఫిక్-2 ఇన్‌స్పెక్టర్‌గా ఎ.సూర్యానాయక్ బదిలీ అయ్యారు. ఎస్‌ఐలు కె.రాఘవేంద్రగౌడ్ చౌటుప్పల్ పీఎస్‌కు, పి.మల్లయ్య రామన్నపేట ఎస్‌హెచ్‌ఓగా, హెచ్.రాఘవేందర్ స్పెషల్ బ్రాంచికి, నారాయణపూర్ ఎస్‌హెచ్‌ఓగా జె.జగన్ బదిలీ అయ్యారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో వివిధ పోలీస్‌స్టేషన్లలో విధుల నిర్వహిస్తున్న 38 కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.



వనజను అభినందిస్తున్న పి.ఎల్.శ్రీనివాస్, అధ్యాపకులు

ఆసియా స్కౌట్ జంబోరీ సదస్సుకు వనజ

సికింద్రాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకలో జరగనున్న పదో ఆసియా స్కౌట్ జంబోరీ-2024 సదస్సుకు అక్షర వాగ్దేవి హైస్కూల్ ప్రిన్సిపాల్ వనజ ఎంపికయ్యారు. మార్పు కోసం నాయకత్వం అనే ఇతివృత్తంతో శ్రీలంకలోని ట్రింకోమలిలో ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు జరిగే ఈ సదస్సులో ఆసియా దేశాల నుంచి పలువురు ప్రతినిధులు పాల్గొంటున్నారు. భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతినిధుల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి వనజ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వనజను అక్షర వాగ్దేవి హైస్కూల్, ఆర్‌జీఆర్ సిద్ధాంతి గ్రూప్ కళాశాలల వ్యవస్థాపకులు, వైస్ చైర్మన్ పి.ఎల్.శ్రీనివాస్ సత్కరించి, అభినందించారు. పాఠశాల ఏఓ శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ రచన, అడ్మిన్ ఇన్‌చార్జి శ్రీనివాస్, కో ఆర్డినేటర్ మహేశ్వరి, లత, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

మారేడుపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి సామ్రాట్ కాలనీలో సోమవారం శ్రీదత్త అనఘేశ్వర ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకులు సి.కృష్ణ శర్మ పర్యవేక్షణలో ఆలయ నిర్వాహకులు రావిచెట్టు గురుప్రసాద్, మొవ్వ అనిల్‌కుమార్, ధర్మకర్తలు ఆర్.శివప్రసాద్, ఆర్.రమాదేవి అధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మండప వాహన పూజ, పుష్పాదివాసం, హోమం, ప్రతిష్ఠ, పూర్ణాహుతి, నీరాజన మంత్ర పుష్పములు, ఏకాదశ రుద్రాభిషేకం పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

సాయన్నకు ఘన నివాళి



సాయన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లాస్యనందిత, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్

మారేడుపల్లి/బోయినపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజల గుండెల్లో దివంగత ఎమ్మెల్యే సాయన్న సుస్థిర స్థానం సంపాదించుకున్నారని ఎమ్మెల్యే లాస్యనందిత పేర్కొన్నారు. సోమవారం కార్ఖానలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సాయన్న మొదటి వర్ధంతి నిర్వహించారు. సాయన్న సతీమణి గీత, కుమార్తెలు నమ్రత, నివేదిత, ఎమ్మెల్యే మల్లారెడ్డి, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, మాజీ బోర్డు ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ సభ్యులు అనితప్రభాకర్, పాండుయాదవ్, లోకనాథం, బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్ సాయన్న చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలు వార్డులకు చెందిన బీఆర్ఎస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువ, మహిళా నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, సాయన్న అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బీఆర్ఎస్ యువ నాయకుడు పెంటా శ్రీహరి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేశారు. కిరణ్‌కుమార్, కట్టా నరేందర్, సక్కుబాయి, శోభ, హరి నరేందర్‌యాదవ్, వేణుగోపాల్‌చారి, రవి పాల్గొన్నారు.

సాయన్న సేవలు మరువలేం

దివంగత ఎమ్మెల్యే సాయన్న సేవలు మరువలేమని బీఆర్ఎస్ నాయకుడు, కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముప్పిడి మధుకర్ పేర్కొన్నారు. బోయినపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాయన్న మొదటి వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రవీణ్ యాదవ్, భాస్కర్, పరశురాం, గోపీకృష్ణ, సిద్ధూ, భరత్ పాల్గొన్నారు.

గ్రేటర్ బడ్జెట్ రూ.7,937 కోట్లు

● ప్రస్తుతంతో పోలిస్తే రూ.1,713 కోట్లు అధికం ● నేడు కౌన్సిల్‌లో చర్చ ● ఆమోదం అనంతరం ప్రభుత్వానికి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ బడ్జెట్ భారీగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రతిపాదించిన బడ్జెట్‌తో పోలిస్తే 2024-25 పద్దును రూ.1,713 కోట్లు పెంచుతూ.. రూ.7,937 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించారు. 2023-24 సవరణ బడ్జెట్ మాత్రం రూ.6,990 కోట్లుగా చూపారు. మొదటిసారి జీహెచ్ఎంసీ చేసిన అప్పులకు సంబంధించిన వాయిదాలు, వడ్డీలకోసం రూ.1200 కోట్లు ప్రభుత్వం నుంచి వస్తుందని ఆశిస్తున్నారు. బడ్జెట్ పెరుగుదలకు ఇది ప్రధాన కారణం కాగా.. మ్యుటేషన్ రుసుము ప్రస్తుతం రూ.10 కోట్లు ఉండగా దానిని రూ.200 కోట్లకు పెంచారు. ప్రభుత్వం నుంచి ఇతర రూపాల్లో వచ్చే ఆదాయమూ రూ.300 కోట్లకుపైగా పెరుగుతుందని ప్రతిపాదనల్లో చూపించారు. ఆస్తిపన్ను, పట్టణ ప్రణాళికా విభాగాల ఆదాయం రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్లు పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ), వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ), కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్ (సీఆర్ఎంపీ)ల కోసం రూ.6,500 కోట్లకుపైగా అప్పు చేసిన నేపథ్యంలో ఆ రుణానికి ప్రతినెలా వడ్డీ, అసలు కలిపి నెలకు రూ.100 కోట్లు చెల్లించాల్సి ఉంది. వాస్తవంగా ఆయా పనులు ప్రభుత్వం చేయాల్సి ఉండడం.. గత సర్కారు ఆదేశాల మేరకు అప్పు తీసుకొని చేసిన దృష్ట్యా.. ఆ మొత్తం ప్రభుత్వం ఇవ్వాలనే బడ్జెట్‌లో ప్రతిపాదించినట్టు ఓ అధికారి చెప్పారు. నేడు జరుగనున్న సమావేశంలో మొదటి సెషన్‌లో ప్రశ్నోత్తరాలపై, రెండో సెషన్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌పై చర్చించనున్నారు. ఆమోదం అనంతరం పద్దును ప్రభుత్వానికి పంపనున్నారు.

బడ్జెట్ సంక్షిప్త స్వరూపం..

రెవెన్యూ ఆదాయం(రూ.కోట్లలో)..
- ఆస్తిపన్ను - రూ.1907 కోట్లు
- టౌన్‌ప్లానింగ్ - 1600
- ప్రభుత్వం నుంచి - 785
- మ్యుటేషన్ రుసుము - 200
- ట్రేడ్ లైసెన్స్ - 110 ● ప్రకటనలు - 20
- ఎస్టేట్ - 10
- రుణ చెల్లింపునకు ప్రభుత్వం నుంచి నిధులు - 1200
- ఇతరత్రా- 106

మొత్తం- 5938

మూలధన ఆదాయం (రూ.కోట్లలో)...
- 15వ ఫైనాన్స్ కమిషన్ - 350
- టీడీఆర్ - 300 ● ఇతర గ్రాంట్లు - 11
- డిపాజిట్ వర్క్ రశీదులు - 8
- ఇతరత్రా రశీదులు - 2
- రుణం- 128
- ప్రభుత్వం నుంచి గ్రాంట్లు - 1200

మొత్తం- 1999

సమాజానికి మార్గనిర్దేశం చేసే రచనలు రావాలి

● మంత్రి పొన్నం ప్రభాకర్ ● ముగిసిన హైదరాబాద్ పుస్తక ప్రదర్శన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు మార్గనిర్దేశం చేసేలా మేధావులు, విద్యావంతులు రచనలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. భిన్న భావజాలాలు, విభిన్న దృక్పథాలకు సంబంధించిన పుస్తకాలన్నీ ఒకచోట ఉండటం, పుస్తక మహోత్సవ ప్రాంగణాన్ని చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. సోమవారం ఎన్టీఆర్ స్టేడియంలో 36వ హైదరాబాద్ జాతీయ పుస్తక మహోత్సవ ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. బుక్ ఫెయిర్ నిర్వహణకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా తాను ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. ఎన్టీఆర్‌స్టేడియంలో శాశ్వత మరుగుదొడ్లు నిర్మిస్తామని వాగ్దానం చేశారు. పిల్లలకు పుస్తక పఠనాభిరుచిని పరిచయం చేసే విధంగా తల్లిదండ్రులు ప్రయత్నించాలని సూచించారు. ఆలోచనలను విస్తృతం చేసుకోవాలన్నా, సమాజాన్ని అర్థం చేసుకోవాలన్నా పుస్తకమే ఆధారమని అన్నారు. యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా, వ్యక్తిత్వాన్ని మలచుకోవడానికి పుస్తకాలను ఆశ్రయించాలని హితవుపలికారు. సామాజిక మార్పునకు దోహదపడంతోపాటు సామాజిక చైతన్యాన్ని పెంపొందించే దిశగా రచనలు చేయడం కవులు, రచయితల బాధ్యత అని అన్నారు. వర్తమానాన్ని విశ్లేషిస్తూ, భవిష్యత్తుకు బాట చూపే ఆశావాహ రచనలు రావాలని ఆకాంక్షించారు. ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ రమా మేల్కొటే మాట్లాడుతూ.. భారతదేశ చరిత్ర, తెలంగాణ చరిత్రలను వక్రీకరిస్తున్న ప్రస్తుత సందర్భంలో వాస్తవాలు పునాదిగా లిఖించబడిన చరిత్ర పుస్తకాలు చదివి అబద్ధాల చరిత్రను తిప్పికొట్టాలని పాఠకులకు సూచించారు. ట్రాన్స్ మహిళ రచన ముద్రబోయిన మాట్లాడుతూ.. సమాజంలో ట్రాన్స్ వ్యక్తుల పట్ల ఉన్న వివక్షకు వ్యతిరేకంగా తమ జీవితాలు ఇతివృత్తంగా మరిన్ని రచనలు రావాలని, అందుకు రచయితలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. ప్రముఖ కవి కె. శివారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచాన్ని చూపించింది, పరిచయం చేసిందీ పుస్తకమే అని అన్నారు. ఓయూ వీసీ రవీందర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, కవి యాకూబ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బుక్ ఫెయిర్ అధ్యక్షుడిది పురుషాహంకార ధోరణి

● స్త్రీవాద రచయిత్రుల ఆగ్రహం ● ట్రాన్స్ మహిళను పిలిచి అవమానించారని విమర్శలు ● అధ్యక్షుడి తీరు సరికాదన్న సామాజిక ఉద్యమకారులు



మాట్లాడుతున్న రచన ముద్రబోయిన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బుక్ ఫెయిర్ అధ్యక్షుడి పురుషాహంకార ధోరణికి నిదర్శనం స్త్రీ వాద రచయిత్రుల సభను జరగనీయకపోవడం అంటూ రచయిత్రులు, సామాజిక ఉద్యమకారులు నిరసించారు. అధ్యక్షుడి తీరును వ్యతిరేకిస్తూ సోమవారం స్టాల్ నెంబరు 205 వద్ద రచయిత్రి సజయ నేతృత్వంలో స్త్రీవాద రచయిత్రులు, సామాజిక ఉద్యమకారులు పలువురు సమావేశం నిర్వహించారు. భిన్న నేపథ్యాలకు చెందిన రచయిత్రులతో 'స్త్రీ వాద రచయిత్రులు - వర్తమాన సవాళ్ళు' అంశంపై ఆదివారం తాము నిర్వహించ తలబెట్టిన చర్చాగోష్టిని సమయం లేదంటూ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు అడ్డుకున్నారని పలువురు రచయిత్రులు, సామాజిక కార్యకర్తలు విమర్శించారు. ఇది మహిళల పట్ల వారికున్న వివక్షకు నిదర్శనమని అన్నారు. బుక్ ఫెయిర్ నిర్వహణ కమిటీలో మహిళల భాగస్వామ్యం లేకపోవడాన్ని ప్రశ్నించారు. ట్రాన్స్ మహిళ రచన ముద్రబోయిన, ఓ వైపు చెత్త సేకరిస్తూ, డిగ్రీ చదువుతున్న వర్ధమాన రచయిత్రి జయలక్ష్మి, ఒంటరి స్త్రీలపై కథా సంపుటి వెలువరించిన విజయ భండారు, సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ రచనలు చేస్తోన్న పూర్ణిమ తమ్మిరెడ్డి, విప్లవోద్యమంలోని మహిళల కథలను సంకలనం చేసిన అనూరాధ, అపర్ణ తోట, మెర్సీ మార్గరెట్, సాత్విక నన్నెబోయిన, దాసోజు లలిత తదితరులు చర్చాగోష్టిలో మాట్లాడాలి అనుకున్న అంశాలను ప్రస్తావించారు. స్త్రీల రచనలకు సంబంధించిన సమావేశాన్ని చివరి నిమిషంలో రద్దు చేయడం అన్యాయమని ఆక్షేపించారు. వీరికి సంఘీభావంగా విజయ్ వంగలపూడి, ఆర్.భరద్వాజ తదితరులు మాట్లాడారు.

వేదికపై వాగ్వాదం

'స్త్రీవాద రచయిత్రులు వర్తమాన సవాళ్లు' సదస్సును చివరి నిమిషంలో రద్దు చేసి విమర్శల పాలైన బుక్ ఫెయిర్ నిర్వాహకులు, ఆ పొరపాటును సరిదిద్దుకొనేందుకు ట్రాన్స్ మహిళా రచయిత్రి, ఉద్యమకారిణి రచన ముద్రబోయినను ముగింపు సమావేశానికి ఆహ్వానించారు. రచనతో మాట్లాడించాలని కార్యనిర్వాహక సభ్యుడు బాల్‌రెడ్డి సూచించగా.. ఎవర్ని అడిగి ఆమెను పిలిచారంటూ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ మండిపడ్డారు. ఈ విషయంలో వేదికపై మంత్రి పొన్న ప్రభాకర్ సమక్షంలో వాగ్వివాదం జరిగింది. మంత్రి జోక్యం చేసుకొని రచన ముద్రబోయినతో మాట్లాడించాలని సభాధ్యక్షుడిని ఆదేశించగా.. గొడవ సద్దుమణిగింది. స్త్రీవాద రచయిత్రుల సదస్సు చివరి నిమిషంలో రద్దవడంపట్ల బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్. శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు. ఇలాంటివి మరోసారి జరగనీయబోమన్నారు.



శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జంపన ప్రతాప్



శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, సారంగపాణి, తదితరులు



నామాలగుండులో జరిగిన శివాజీ జయంతిలో యువత



శివాజీ జయంతి కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, తదితరులు

శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

● పలుచోట్ల జయంతి

బోయినపల్లి/బౌద్ధనగర్/బేగంపేట/పద్మారావునగర్/అడ్డగుట్ట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ సనాతన ధర్మ పరిరక్షకుడని పలువురు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సోమవారం శివాజీ జయంతి సందర్భంగా పలుచోట్ల ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు వారు నివాళులర్పించారు. బోయినపల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ వద్ద స్వామి వివేకానంద సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ హాజరయ్యారు. కార్యక్రమంలో వీఆర్ ఆస్పత్రి ఎండీ నందకిషోర్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.దయానంద్ యాదవ్, ఎస్.శశిరాజ్ యాదవ్ పాల్గొన్నారు. వారాసిగూడలోని శివాజీ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, నిర్వాహకుడు భాస్కరగిరి నివాళులర్పించారు. నామాలగుండు, వారాసిగూడ, పార్శిగుట్ట ప్రాంతాల్లో జరిగిన ర్యాలీ, తదితర కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. బేగంపేట డివిజన్ మాతాజీనగర్ నుంచి నిర్వహించిన శోభాయాత్రను బీజేవైఎం నేత పురురవారెడ్డి ప్రారంభించారు. బీజేపీ నాయకుడు నెమలి ఆనంద్, శివాజీ యువసేన, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు. అడ్డగుట్ట చౌరస్తాలో బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు గెల్లు ఉదయ్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు మద్దర్ల సుందర్, శివాజీ, రాజేష్, కళావతి, శ్యామల నివాళులర్పించారు.

రెజిమెంటల్‌బజార్‌లో పెట్రేగిపోతున్న దొంగలు



నిద్రపోతున్న వ్యక్తి జేబు కత్తిరిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల నేరాలు ఎక్కువయ్యాయి. కొందరు యాచకులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదుట ప్రజలను భయపెట్టి దోపిడీకి పాల్పడుతున్నారు. రైల్వేస్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉచిత భోజనం, అల్పాహార కేంద్రాలు ఉన్నాయి. వీటి వద్ద యాచకులు పెద్దసంఖ్యలో తిష్ఠ వేస్తున్నారు. రెండు రోజుల క్రితం రెజిమెంటల్ బజార్‌లో ఓ వ్యక్తి దుకాణం ఎదుట నిద్రపోగా గుర్తు తెలియని వ్యక్తి అతడి జేబు నుంచి నగదు దొంగతనం చేశాడు. బాధితుడు గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెజిమెంటల్‌బజార్‌లోని సంతోషిమాత ఆలయం, బ్లూసీ హోటల్, రైల్వేస్టేషన్ కారు పార్కింగ్ వద్ద, ఆల్ఫా హోటల్ ఎదుట రాత్రి సమయంలో రైళ్ల కోసం వేచి ఉన్న ప్రయాణికులు, ఫుట్‌పాత్‌లపై పడుకునే వ్యక్తులను వీరు టార్గెట్ చేస్తున్నారు. ప్రయాణికుల్లా నటిస్తూ వారి మధ్యే ఉంటూ అర్ధరాత్రి సమయంలో వారి జేబులను కత్తిరిస్తున్నారు. రాత్రి సమయంలో గోపాలపురం పోలీసులు పెట్రోలింగ్ చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గడ్డర్ తగిలి కూలీ మృతి

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైల్వే బ్రిడ్జి వద్ద వాహనాల ఎత్తు నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన గడ్డర్ తగిలి ఓ కూలీ తీవ్ర గాయాలై మృతి చెందాడు. కర్నాటకలోని గుల్బర్గాకు చెందిన చవాన్ శివ (23) సోదరుడు రమేష్‌తో కలిసి అత్తాపూర్‌లోని ఇటుక బట్టీలో దినసరి కూలీగా పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఆదివారం అర్ధరాత్రి ఇటుకల లోడ్‌తో విద్యానగర్ బయలుదేరిన లారీ పైభాగంలో మరో ఇద్దరు కూలీలతో వెళ్తుండగా ఆర్పీ రోడ్డులోని రైల్వే బ్రిడ్జి వద్ద గడ్డర్ తగిలింది. తీవ్రగాయాలు కావడంతో శివ మృతిచెందాడు. సెక్రటేరియట్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బేగంపేట ఫ్లైఓవర్‌పై డివైడర్‌ను ఢీకొట్టిన కారు

● ఒకరికి గాయాలు



ఫ్లైఓవర్‌పై డివైడర్‌ను ఢీకొట్టిన కారు

బేగంపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న కారు ఫ్లైఓవర్‌పైన మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతినడంతో పాటు అందులో ప్రయాణిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బేగంపేట ఫ్లైఓవర్‌పై సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నుంచి పంజాగుట్టవైపు వెళ్తున్న కారు తెల్లవారుజామున 5:30 గంటల సమయంలో బేగంపేట ఫ్లైఓవర్‌మీదుగా వెళ్తుండగా... మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న ఐటీ ఉద్యోగి గౌతమ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో గాయపడిన వ్యక్తిని బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గురైన కారును క్రేన్‌తో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం

నగరంలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు అదృశ్యమయ్యారు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో ఒకరిని పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.



గౌస్‌ఖాన్

బోయినపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తాడ్‌బందులో నివాసముంటున్న గౌస్‌ఖాన్ (43) ఓ ఫంక్షన్ హాల్లో రోజువారీ కూలి. మూడు రోజుల క్రితం ఫంక్షన్‌హాల్లో పనికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. అతడి ఫోన్ పనిచేయకపోవడంతో అనుమానం వచ్చిన గౌస్‌ఖాన్ భార్య బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అక్క ఫోన్ ఇవ్వడం లేదని వెళ్లి..



చేతన

అక్క ఫోన్ ఇవ్వడం లేదని మనస్తాపం చెందిన దివ్యాంగ విద్యార్థిని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కనుగొన్న పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఓల్డ్ బోయినపల్లికి చెందిన సింగం సాయికుమార్ చిన్న కుమార్తె చేతన(13) దివ్యాంగురాలు. స్వీకార్, ఉపకార్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఫోన్ కోసం ఆదివారం అక్కతో గొడవపడిన చేతన ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంతకూ రాకపోవడంతో కుటుంబసభ్యులు అనేక ప్రాంతాల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో ఆదివారం రాత్రి చేతన తండ్రి సాయికుమార్ బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చేతన ఫొటో, వివరాలను పోలీసులు ఆర్టీసీకి సంబంధించిన వాట్సాప్ గ్రూపులు, వివిధ వాట్సాప్‌లలో పెట్టారు. ఈ క్రమంలో చేతనను గుర్తించిన ముషీరాబాద్ ఆర్టీసీ డిపో ఉద్యోగులు పోలీసులకు సమాచారం అందించగా వారు చేతనను తీసుకెళ్లి తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కుమార్తెను క్షేమంగా అప్పగించిన బోయినపల్లి పోలీసులకు చేతన తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

అడ్డగుట్టలో మహిళ..

అడ్డగుట్ట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్‌మారేడుపల్లిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ప్రైవేట్ ఉద్యోగి మల్లిక (29) ఈ నెల 18 నుంచి కనిపించకుండా పోయింది. ఆందోళన చెందిన ఆమె తల్లి అనేక ప్రాంతాల్లో వెతికింది. ఆచూకీ లభించకపోవడంతో తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

బ్లడ్ బ్యాంకు ముసుగులో ప్లాస్మా సేకరణ

● రెండు సెంటర్ల లైసెన్స్‌లు రద్దు

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మానవ ప్లాస్మాతో అక్రమ దందా చేస్తున్న రెండు బ్లడ్ బ్యాంకుల లైసెన్స్‌లను ఔషధ నియంత్రణ సంస్థ(డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్) రద్దు చేసింది. బ్లడ్ బ్యాంకు ముసుగులో ప్లాస్మా సేకరిస్తున్నట్లు అధికారులకు ఈనెల 2న సమాచారం అందడంతో మూసాపేటలో హైమా సర్వీస్ లేబొరేటరీస్‌లో దాడులు నిర్వహించారు. ఫ్రీజర్లలో హ్యూమన్ ప్లాస్మా బ్యాగ్‌లను గుర్తించారు. ఆర్.రాఘవేంద్రనాయక్ అనే వ్యక్తి అపార్ట్‌మెంట్‌లో ల్యాబ్ నిర్వహిస్తూ.. పలు బ్లడ్ బ్యాంకుల నుంచి అక్రమంగా ప్లాస్మా సేకరించి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ప్లాస్మా సేకరణ నిమిత్తం శ్రీకర హాస్పిటల్ బ్లడ్ సెంటర్, న్యూ లైఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ బ్లడ్ సెంటర్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా సహకరించినట్లు తెలిసింది. అధికారులు మదీనాగూడలో ఉన్న వెంకటేశ్వర ఆర్థో హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుబంధంగా ఉన్న శ్రీకర హాస్పిటల్ బ్లడ్ సెంటర్, దారుల్‌షిఫాలో గల న్యూ లైఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ బ్లడ్ సెంటర్‌పై దాడులు నిర్వహించారు. సిబ్బందిని విచారించగా.. రక్త సేకరణ తర్వాత ప్లాస్మా తీసి తరలిస్తున్నట్లు అంగీకరించారు. ఆ సెంటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసి లైసెన్స్‌లు రద్దు చేసినట్లు డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు.